# "జెనుల నోల్లల్ల భారతం"

భారతం, రామాయణం కతలు జెనంనోల్లల్ల ఎప్పటికాడుతనే ఉంటయి. అంత్ల పాత్రల పేర్లను తలువందొక్క రోజన్న గడువదంటె గండ్ల వింతేలేదు. ఇంటె భారతమినాలి. తింటె గారెలే తినాలని మా నాయిన్న గిట్టనంగ నేనెన్నో సార్లిన్న. భారతం కతలను భాగోతులోల్లు, హరికతలోల్లు ఆడుతంటె, సెప్పుతంటె సిన్నప్పుడినెటోన్ని. చిన్నప్పుడే పిల్లల భారతం సదివిన. ఎన్నిసార్ల భారతం కథ విన్నా, చదివినా మల్ల సదువన్ననిపించుడు నాకు భలే గమ్మత్తనిపిచ్చేది. ఊళ్ళెకు ఏ నాటుకం కంపినచ్చి భారతం కతకు సంబంధించిన నాటుకమాడిని ఇడ్సిపెట్టకుంట సూసెటోన్ని. భారతకతంటె సెవ్వు గొసుకునేటోన్ని. సదువుతున్నకొద్ది, సూత్తున్నకొద్ది నాయిన్న సెప్పిన మాటలు నిజమేననిపిచ్చినయి.

ఏ గుంట సూసినా అక్కడ సీతమ్మ బట్టలారేసుకుందని, పాండువలడుగు పెట్టని జాగే లేదని గిట్ల అరొక్క జాగకు ఏదో ఇతిహాసాన్ని కల్పించి చెప్పుతరు మనోల్లు. సీతమ్మ కట్టాలు, ద్రౌపదిదేవి కష్టాలు ఎవ్వరికి రావద్దంటరు. రాముడడుగేసెపటికెనే ఆ ఊరు రామడుగైందని రాముని కాలువడ్డ గుట్టలు రామగిరి గుట్టలయినయని కూడ సెప్పుతరు. నాంపెల్లి నర్సిమ్మసామి దగ్గెరున్న గుట్టమీన రాజరాజనరేంద్రుడు లడాయి సేసిండంటరు. గక్కన్నే చిత్రాంగి సెప్పుతె సారంగధరుని కాల్రెక్కలు నరికించిండని గూడ జెప్పుతరు.

ఫెలఫెల మనురుముతె, చర్ చర్మని మెరిత్తె 'అర్జునా ఫల్గునా' అని తల్సుకునుడు వానకాలంల మనం రోజింటనే ఉంటం. చీకట్ల పోయెటప్పుడు బయమయితె ఆంజనేయదండుకం నోట్లె సదువుకుంట హనుమంతున్ని యాజ్జేసుకుంటె బయం బోతదని గూడ మన పెద్దోల్లు సెప్పంగినుంటం. అర్జునుడు గోవుల మలుపుడు గురించి భీముని బలం గురించి శారదకాల్లు పండ్లు పటపట కొరుక్కుంట ఉరుకులాడుకుంట సెప్పుతంటె రగుతమంత వేడయ్యేటిది. కౌరవుల మీదికురికి నమిలి మింగుదామనిపిచ్చేది.

నువ్వు దరుమరాజోలె దరుమం తప్పకుంట మొదులాలని సిన్నప్పుడనెటోడు మా నాయిన్న. ధరుమరాజు ఒక్కటేసారి అవ్దమాడిండు. ద్రోణున్ని సంపుటానికి అశ్వత్థామ హతోహతః అన్నడు. గా ఒక్కవద్దమే గీకలియగంల గిన్ని అవద్దాలయిందని దరుమరాజు గాయింతొక్క అవద్దమాడకుంటె గీకలీగంల అవ్దమ్మనేదే ఉండకపొయ్యేటిదని గూడ సెప్పుతరు. కర్ణుడు తన కొడుకని కుంతిదేవి

సెప్పలేదు. అమె సెప్పుంటె భారతలడాయె జరుగకపోవు. గది దాసిపెట్టిన కుంతికి దరుమరాజు ఆడోల్లనోట్లె మాటాగాద్దని శాపం బెట్టిండంటరు. గప్పట్నుంచి ఆడోల్ల సెవ్వులేదన్న మాటపడితె అది పొద్దుగూకెవరకు ఊరంత తిరిగి మల్ల సెప్పి ల్లదగ్గరికే వత్తదని దరుమరాజు శాపం మాదండెదనంటరు. భీముడు గంత బలమున్నోడయినా అన్న మాటమీన నిలబడి అన్యాయెం జరుగుతున్నా పండ్లు పటపట కొరుక్కుంటడు. అకరుకు అల్లకే న్యాయెమైతదని గిట్ల భారతంల సానసంగతుల గురించి జెనాలల్ల రోజు ఎక్కన్నో ఓ కాడ మాట్లాడుకోంగింటం.

అయితె గిట్ల భారతాన్ని అండ్ల పాత్రలను యాజ్జేసుకునుడు వేరు. అండ్ల సంగతులతోని పోల్చి జీవితానికి ముడివెట్టి మాట్లాడుడు వేరు. కర్ణుని సావు గురించి, సెప్పుకుంట గయినె సావుకున్న ఎవుసదారుడు కిందికి పోవుటానికి ఉన్న సంబందంను గురించి కాపు ఎల్రెడ్డి మాటలు నాకు ఆశ్చర్యాన్ని కల్గించినయి. కర్ణుని సావుకెన్ని కారునాలున్నయో ఎవుసదారుని ఈన పరిస్థితికి గన్ని కారణాలున్నయంటడు ఎల్రెడ్డి. ఓనాడు నేనూల్లె మొకాన పొయ్యేవారకు మూడు బజార్లకాడ బండమీన కూసున్నడు ఎల్రెడ్డి. నేంబొయ్యి పక్కపొంటి కూసుండి "మంచిగున్నావె" అనడిగిన.

"అం....ఇగ గిట్లున్న" అన్నడు. ఎల్రెడ్డి.

"ఏందెట్లనో ఉన్నవేందే? పానం మంచిగ లేదా?"

"పానానికేమైందే బండోల్నే ఉన్న. కని నాకసలే సముజయితలేదు. గీ ఎవుసంల గడియరికాము లేకుంట పనిజేసుడే కనిగిండ్ల మిగులుడైతేం లేపాయె. సిన్న సిన్నెవుసాలతోని కట్టమే ఉందే".

"గద్దెలువందెవ్వలకు గని గిట్లుండుటానికి కారుణమేందనుకుంటున్నవు. నువ్వెప్పుడన్న ఆలోసించినవా?" అన్న నేను.

"మొన్నోపారి కర్ణుని కత బాగోత మాడింద్రు. గండ్ల కర్ణున్ని సంపుడు గురించి కృష్ణుడు అర్జునుంతోని సెప్పుతడు. గవ్వింటె గాకర్ణుని సావుకెన్ని కారుణాల్నుయో రైతు రోజురోజుకు కిందికి పోవుటానికి గన్ని కారణాలున్నయనిపిత్తది. కర్ణుడు నిజానికైతె అర్జునునికన్న ఎక్కో బలవంతుడేనా? అయినాగని సావవల్సచ్చింది. గట్లనే ఎవ్వలను ముంచకంట, ఇరాం లేకుంట మేం పన్జేసినాగని కిందికే పోవుడైతంది"

"నువ్వనేది నాకరుతంగాలే" కర్ణుని సావేంది? మీరు కిందికి పోవుడంఏది? కొంచెం సంరిగ్గ సెప్పు".

"రథం దిగవడితె గిరెత్తుటానికి ప్రయెత్నం సేత్తండు కర్ణుడు. గదేసమయమని సంపుమంటడు క్రిష్ణుడు. కనిగదన్నాయెం సంపనంటడు అర్జునుడు. గప్పుడు క్రిష్ణుడంటడు "అర్జైనా! కర్ణున్ని నువ్వు సంపుతన్ననుకుంటన్నవు. నూటికి తొంబైపాల్లు అయినె ఇదువరకే సచ్చిపెయిండు. ఇంద్రుడచ్చి మోసంతోని కవచకుండలాలు కొంచవోతడు". అంతకుముందే గురువనుకున్న పరుశురాముడు శాపమిత్తడు. అర్జునున్ని తప్ప వేరేవాళ్ళను చంపద్దని కుంతి మాటదీసుకుంటది. మరోదిక్కు బూదావెర గోరశాపముంది. గంత బలవంతున్ని భీష్ముడు అర్ధరథుడని చులకన సేత్తడు. గివ్వన్ని పోంగ లడాయి జరుగంగ శెల్యుడు మాటమాటకు చులుకన సేసుకుంట శత్రువును పొగుడుకుంట కర్ణుని ఉత్సాహంమీన నీల్లు జల్లుతడు. గిట్ల గింతమంది గలిసి కర్ణున్ని తొంబైపాల్లు సంపేసిండ్రు. ఇగ నువ్వు సంపేది పది పాల్లేనంటడు.

గట్లనే రైతు కిందికి పోవుటానికి, రోజుకింత బూమినమ్ముకోడానికి గూడ, సానకారణాలున్నయని నాకనిపిత్తంది. ప్రకృతిదేవత సమయానాకి కండ్లజూడకపాయె. సముయానికి పెట్టుబల్లకు పైసలు దొరుకకపాయె. అడ్డగోలు మిత్తికి ఊల్లె అప్పులు చెయ్యన్నాయె. ఇంకోదిక్కు సరుకారు బాకీలాయె. మందులకు మాకులకేమొ మస్తుదరుండె. రైతమ్మె పంటకేమొ దరుండకపాయె. అటు మధ్యవర్తుల దగ, ఆపీసులల్ల మోసం, ధరల గడబిడ, గిట్ల ఎన్నో కారణాలతోని రైతు కిందికే పోతండు. కాదంటావె? నువ్వు సదువుకున్నోనివి".

ఎర్రెడ్డి సునిశిత పరిశీలన శక్తికి నేనాశ్చర్యపెయిన.

"నువ్వు సెప్పింది నూటికి నూరుపాల్లు నిజెం" అని లేచిపోయిన.

అవును. మట్లె మట్టె పన్జేసి రైతు రోజుకింత కిందికే పోతండు. రోజింత బూమి కర్పూరమోలె కరిగిపోతంది. రైతులు ఊల్లిడిసి వలసపోతండ్రు. కొందరు కూలీలైతండ్రు. గిట్లయితె గీ ఎవుసాలేమైతయి? నా అండ్ల నేనే మదనపడుతుంట ఎన్నోసార్లు.

★★★